# తీరిన కోరికలు

శేఖర్:

సరిగ్గా పది గంటలకు బస్సువచ్చి ఆగుతుంది ఆ బస్ స్టాప్‌వద్ద. సరిగ్గా అదే సమయానికి త్రేతాయుగంనాటి నా బైక్‌మీద నేనక్కడికి చేరుకొంటాను.

ఏదిముందో ఏది వెనుకో చెప్పటం కష్టం గాని నే నక్కడికి చేరిన సమయానికే ఒక అమ్మాయి బస్సులోనుంచి దిగుతుంది. పసిమి శరీరచ్ఛాయ, వెడల్పాటి గుండ్రటి కళ్ళు, ముడేసి వదలుగా వదలిన కారు మేఘాల్లాంటి నల్లటి జుట్టు, ఏదో దైన్యం ఉట్టిపడుతూ ఆకర్షణీయంగా అందంగా వుండే మొహం, తెల్లటి సాదా చీరె, ఆమె అలంకారాలు. అన్నట్టు - మరచిపోయాను! దిగుతూండగా ఆ అమ్మాయివైపు చూస్తాను నేను. అదే సమయంలో ఆ అమ్మాయి నావైపు చూస్తుంది. ఇద్దరం తలలు వంచుకొని ఒకేవైపు బయలుదేరుతాం. కొంచెం దూరంపోయాక ఆమె ఆఫీసు వస్తుంది. ఆఫీసు ఆవరణలో అడుగుపెడ్తూ ఆమె వెనక్కుచూస్తుంది. అదే సమయానికి నేనూ ఆమె వైపేచూస్తుంటాను. ఆమె నా వైపు చూసేసరికి నాకు నవ్వొస్తుంది. నవ్వుతాను. ఆమె గూడా నవ్వుతుంది. ఆ క్షణంలో ఆమె మొహంలోని దైన్యంపోయి ఆనందంతో వికసించినట్లు నా కనిపిస్తుంది. నా హృదయంలోని ఏదో భారం తొలగిపోయినట్లు అనిపిస్తుంది గూడా! ఆ అమ్మాయి తన ఆఫీసులోకి వెళ్తుంది. నేను నా ఆఫీసు చేరుకొంటాను పదిన్నరకల్లా. యీ కార్యక్రమం ప్రతి నిత్యం నైరు వర్కులాగా ఒక దాని వెంట ఒకటి జరిగిపోతుంటాయి. ఒక్కొక్కప్పుడు అనుకొంటాను —— మర్నాటినుంచి ఆలస్యంగా ఆఫీసు కెళ్లాలని, ఆ అమ్మాయిని చూడగూడదని. కానీ ఏ రోజూ అలా జరుగలేదు. ఏరోజూ అలా చేయలేదు. ఎందుకో నాకే తెలీదు!

విమల:

బస్సు దిగే సమయానికి ఎదురుగ్గా వుంటాడు అతను. ఎందుకో తెలీదు గాని అతను నన్ను చూడకుండావున్న సమయంలో అతనికి తెలీకుండా అతన్ని చూడాలనిపిస్తుంది. అతనివైపు తిరిగేసరికి అతనూ నావైపే చూస్తుంటాడు. నట్ట నడి వీధిలో అతని వైపు చూడట మేమిటని నన్ను నేనే సమాధాన పర్చుకొని ఆఫీసు కెళ్తాను. ఆఫీసులో కెళ్ళేటప్పుడు అతనేం చేస్తుంటాడో చూద్దామనిపిస్తుంది. చూస్తే నవ్వుతుంటాడు. అతని నవ్వు మొహం, మాట్లాడకుండా తను చేస్తున్న అల్లరి తల్చుకొనేసరికి నా కేమో నవ్వొస్తుంది. అంతే—— ఆ తర్వాత అతని దారి అతనిది, నా దారి నాది.

శేఖర్:

ఆమె పేరు విమలట. విమలంటే నా కేదో ఒక విధమైన మమకారం వుందని తెలుసుకొన్నాను.

కానీ ఆ అమ్మాయిని పల్కరించాలంటే నా కేదోగా వుంది. ఏం చెయ్యటం! ఎలా!

విమల :

మామూలుగానే ఆ రోజు ప్రొద్దున జరిగి పోయింది. సాయంత్రం ఆఫీసునుంచి బయట కొచ్చేసరికి అత నున్నాడు. అతనివైపు చూడకుండా తలకాయ వంచుకొనిపోతుంటే, 'ఏమండీ!' అని పిల్చాడు. ఎవరినోలే అనుకొనిపోతుంటే 'మిమ్మల్నేనండీ విమల గారూ!' అని అన్నాడు. చెప్పొద్దూ! నా కదో విధంగా అయిపోయింది. వెనక్కి తిరిగి చూచాను. అతని పేరు శేఖరట. నన్ను ప్రేమిస్తున్నానని, నాకు అతనంటే యిష్ట మున్నది లేనిదీ చెప్పమనీ, నా కిష్టమైతే వివాహం చేసికొంటాననీ యివన్నీ తను మనసులో దాచుకోలేక చెపుతున్నానని అన్నాడు. కాని నేనేమని చెప్పటం! ఎట్లా చెప్పటం!..

శేఖర్ :

విమలకు గూడా నేనంటే ప్రేమ వుందట. తనే నాతో చెప్పాలనుకొందట. కానీ భయపడి సిగ్గుచేత చెప్పలేకపోయిందిట. విమల తన కథంతా నాతో చెప్పింది. చిన్నతనంలో, పెళ్ళంటే ఏమిటో వూహన్నా లేని రోజుల్లో, విమలకు పెళ్లయింది. పెళ్లయిన కొద్ది రోజుల్లో భర్త చనిపోయాడు. ఎలాగోలాగు కష్టపడి ఇంటర్ ప్యాసయింది. తర్వాత వాళ్ళమ్మా నాన్నా చనిపోవటంతో చదువుకు వుద్వాసన చెప్పి వాళ్ళన్నయ్య ద్వారా యీ వుద్యోగంలో చేరింది. నాకిష్టమైతే నన్ను పెళ్లి చేసుకోవటానికి సిద్ధంగా వున్నానంది. విమల కథంతా వినేసరికి నాకు దిగులేసింది. దిగులుతోపాటు ఆమెపై జాలికూడా కలిగింది. దానితోపాటు ఎలాగైనా విమలను వివాహమాడాలనే వాంఛఎక్కువయింది. కానీ—విధవా వివాహం చేసుకొంటానంటే నాన్న వొప్పుకొంటాడా! అసలు నాన్నతో యీ విషయం చెప్పటం ఎలా!

లక్ష్మీపతి :

వెధవను యిన్నేళ్ళూ పెంచి, చదువు చెప్పించి వుద్యోగం యిప్పించి నల్గురులోనూ ఒక మనిషిగా తిరిగేటట్లు చేసినందుకు మంచి శాస్తి చేస్తానన్నాడు. ఎన్ని గుండెలు లేకపోతే నా దగ్గరకొచ్చి ఎదుట నిలబడి ఒక తడవ పెళ్లైనదాన్ని తిరిగి పెళ్లి చేసికోటానికి వొప్పుకోమని అడుగుతాడు. ఒక్కో వంశానికి ఒక్కో కులనాశకుడు పుడ్తుంటాడు. కర్మ కాకపోతే నిప్పంటి వంశంలో పుట్టిన వెధవకు రెండో వివాహ మాడదామన్న బుద్ధి పుట్టటం ఏమిటి! ఇటువంటి వెధవ వుంటేనేం వూడిపోతేనేం! అందుకే ఖచ్చితంగా చెప్పేను. బుద్ధిగా నేను చెప్పినట్లు వింటే అస్తిలో కాస్తో కూస్తో యిస్తానని, లేకపోతే వాడి మొహం చూడననీ. వంశ మర్యాద పరువు ప్రతిష్ఠలకన్న వీడెక్కువా నాకు! వీడుపోతే యింక యిద్దరున్నారు నాకు.

విమల :

తండ్రితో పోట్లాడి వచ్చి నన్ను పెండ్లి చేసికొంటానంటాడు శేఖర్. శేఖర్‌కు తల్లి చిన్నతనంలోనే చనిపోయిందట. కొడుకులమీద ప్రేమ పెట్టుకొనివున్న ఆ తండ్రి హృదయాన్ని

బాధ పెట్టటం మంచిది కాదని చెప్పేను శేఖర్‌తో. కాని శేఖర్ తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనే మనస్తత్వం కలవాడు. నన్ను కోప్పడి పెండ్లి చేసికొన్నాడు. నేనుమటుకు ఆయన మాటను కాదంటే ఏం బాగుంటుంది!

శేఖర్:

కృతయుగం నాటి ఆలోచనలు కాకపోతే ఇంకా యీ కాలంలో వితంతు వివాహాలు చేసికొంటే తప్పనే వాళ్ళెవరు! అదీగాక విమలకు వూహ తెలియని రోజుల్లో పెండ్లిచేసి, భర్త చనిపోతే ఆమె జీవితమంతా ఎండిపోయిన మానులాగా గడపవలసిందేనా! అది ఆ పెండ్లి చేసిన పెద్దల తప్పుగాని ఆమేం చేస్తుంది! యీ మాటంటే ఒప్పుకోరు ఆ పెద్దలు. "ఆమె మొహాన భగవంతుడు అలా రాసిపెట్టేడు——ఆమె అదృష్టం అలా వుంది" అని సమర్థించు కొంటారు. "ఆమె అదృష్టం కాబట్టే నేను పెండ్లి చేసుకొంటాను." అని ఎవరైనా ముందుకు వస్తే యీ పెద్దమనుషులంతా వాడిని సంఘంలోనుంచి వెలివేస్తామంటారే గాని దానికి సమాధానం చెప్పి సమర్థించుకొనే శక్తి లేదు. అందరూ సంఘాన్ని సంస్కరించాలని వుపన్యాసాలిచ్చేవాళ్ళు తప్పితే ఆచరణలో పెడ్దామనే ఆలోచనే వుండదు. చెప్పుకోగూడదు గాని—— మా నాన్న స్టేజీ ఎక్కి ఏకబిగిని అయిదు గంటల సేపు బాల్య వివాహాలు పనికి రావని, విధవా వివాహాలు చేసికోవాలని వుపన్యాసాలయితే యివ్వగలడు గాని, కొడుకు వాటిని ఆచరణలో పెడ్తాననేసరికి వంశాలు, పరువులు, ప్రతిష్టలు అడ్డం వస్తాయి. అందుకే అందర్నీ కాదని ధైర్యం చేసి విమలను పెండ్లి చేసికొని కాపరం పెట్టేను. నేను చేసింది తప్పు కాదని నాకు తెలుసు. మా నాన్నంటే నాకెప్పటికీ గౌరవమే! ఎప్పటికైనా ఆయనే తెలుసుకొని నా దగ్గరకొస్తే గౌరవంగా ఆదరిస్తాను. అంతకన్నా నేను చేయగలిగింది ఏమీలేదు కూడా.

విమల:

ఇద్దరం పది గంటలకల్లా భోజనం చేసి ఆఫీసుకు కలిసే వెళ్ళేవాళ్లం. అయిదు కాగానే వచ్చేవాళ్ళం. మొదట్లో నన్ను ఉద్యోగం మానుకోమని బలవంతం చేశాడు శేఖర్. కానీ ఆయన ఒక్కడి సంపాదనతో యివాళ గడుస్తుంది గాని భవిష్యత్తులో ఎట్లా! అందుకే కాదని ఉద్యోగం చేస్తున్నాను. కానీ ఏం ప్రయోజనం!

శేఖర్:

నేనిది ఆలోచించే మొదట్లోనే ఉద్యోగం మానేయమన్నాను. పెండ్లయి సంసారం చేయాల్సిన ఆడదానికి ఆఫీసు పనులు ఎలా కుదురుతాయి. దానికే తెల్సివస్తుందని అప్పుడు సరే నని ఒప్పుకున్నాను. తనంతట తానే చెప్పింది ఉద్యోగం మానేస్తానని. ఎందుకని అడిగితే నవ్వి రహస్యం చెప్పింది. ఏమిటో తెలుసా! నేను తండ్రిని కాబోతున్నాను. ఇంకేమిటి చేయటం! అంతకన్నా కావల్సిందేమున్నది!

లక్ష్మీపతి:

కొడుకులు ఏదో వుద్ధరిస్తారని వాళ్ల మీద మమకారాలు పెట్టుకొని మనం చావటమే కాని వాళ్లకి మన మీద ఆవగింజంతైనా ప్రేమ వుండదు. అందుకే అంటారు 'పెళ్లాం బెల్లమాయె తల్లి చేదాయె' అని. పెళ్లాం వస్తే రక్త సంబంధమున్న తల్లిదండ్రులను గూడా మర్చిపోతారు కొడుకులు. పెద్ద కొడుకు పెళ్లాంచేతిలో కీలుబొమ్మ. ఆ కోడలిగారికేమో ఎంతసేపూ పుట్టింటియావతప్పితే మన సంగతి పట్టదు. రెండోవాడు పెళ్లాంకోసమని నాతో పోట్లాడి కులభ్రష్టుడై లేచిపోయె. మూడోవాడు చదువులంటూ డబ్బుకోసం ప్రాణాలు తీసే అవస్థలోనే వున్నాడుగాని పెళ్లాంకోసం గొడవలు పెట్టుకొనే అస్థితికి రాలేదు. పెద్దతనమేమో నెత్తిమేద కొస్తున్నది. చేసేవాళ్లు లేరు. నిన్నగామోసు శేఖరం దగ్గరనుంచి, కొడుకు పుట్టేడని, నన్ను రమ్మని జాబు వచ్చింది. ఎలాగైనా వాడికి నేనంటే చిన్నతనం నుంచి గౌరవమే. ఆలోచిస్తే వాడిదేమీ తప్పులేదని అనిపిస్తుందప్పుడప్పుడు. ఇంట్లోనుంచి గెంటేసి మళ్లీ ఏ మోహం పెట్టుకొని వాడి దగ్గరికెళ్లటం!

విమల :

మీరేపోయి పిల్చిరండి అని అంటే ఆయనేమో నా మాట వినకుండ పోస్టుకార్డు చేత కబురు పంపించాడు. పెద్దవాడు మామామగారు కూడా 'పోనీలే' అని అనుకొని వస్తారేమో అని అనుకొంటే ఆయన రాలేదాయె. నావల్లనే కదా వీళ్లిద్దరూ యిలా తగాదాలు పడ్డారని అప్పుడప్పుడూ బాధపడ్తుంటాను. కాలం కలిసొచ్చి అదృష్టముంటే ఎప్పటికైనా మామీద మామగారికి జాలి కలక్కపోతుందా. మళ్లీ తండ్రీ కొడుకులు కలిసిఉండకపోతారా! అని అనుకొని ఊరుకోటం తప్ప బాధపడి ఏం ప్రయోజనం.

లక్ష్మీపతి :

అనుకున్నంత పని అయింది. మంచంలోనుంచి లేవలేని స్థితిలో చేసే దిక్కులేక బాధపడాల్సిన గీత రాసింది నాకు. కోడలుండి కూడా ఆడదిక్కులేని సంసారమయింది. కోడలికి నేనంటే గిట్టదు. చేసే దిక్కు లేకపోయిన తర్వాత ఎంత డబ్బుండి ఏం ప్రయోజనం! రెండో కోడలు మర్యాదస్థురాలని, నెమ్మదైనదని వాళ్లూ వీళ్లూ చెప్పగా విన్నాను. అక్కడికైనా పోదామంటే శక్తి లేదు. పైగా కొడుకు పుట్టాడని వ్రాస్తే పోకపోతిని. ఎంతో కాలానికి నాకు మనుమడు పుడ్తే వాడిని చూచే అదృష్టాన్ని చేతులారా చెరుచుకున్నాను గదా! అని యిప్పుడనుకొంటాను. ఏమయితే అవుతుందని ఇక్కడికే రమ్మని వ్రాశాను. శేఖరం వస్తాడోరాడో! నాగతెట్లా వుందో!

శేఖర్:

ఆ రోజు ఆఫీసులో వుండగా. ప్రమోషన్ ఆర్డర్ వచ్చింది. ఈ వార్త విమలతో తొందరగా చెప్దామని ఎలాగోలాగు అయిదు గంటలదాకాకాలాన్ని ఖూనీచేసి యిల్లు చేరాను ఆనందంగా. వాకిట్లోనే ఎదురొచ్చింది విమల. ఆనందంగా చెప్దామనుకొన్న నానోట్లో మాట నోట్లోనే వుండిపోయింది, విమల దిగులు మొగాన్ని చూచేసరికి. చేతికిచ్చింది ఉత్తరాన్ని. నాన్నకు జబ్బుగావుందని, వెంటనే

బయలుదేరిరమ్మని, నాన్న వ్రాయమన్నాడని వ్రాసేడు తమ్ముడు. నాకేం తోచలేదు.

విమల :

మామగారి గదిలో అడుగుపెట్టేసరికి ఒళ్లంతా జల్లరించింది నాకు. గదంతా చిందర వందరగా పండ్ల తొక్కలూ వాటితోటి అసహ్యంగా వుంది. పడుకున్న పక్కంతా మాసిపోయి వుంది. దగ్గరికెళ్లి ''మామగారూ!'' అని పిల్చాను. కళ్లుతెరచి చూచారు మామగారు. ఆనందంతో? ఆయన కళ్లు తళతళ మెరిశాయి. ఏదో చెప్పాలని ప్రయత్నం చేశారు కాని నోట్లోనుంచి మాటరాలేదు. నోరు వంకరపోయింది. మామగారికి పక్షపాతం. అప్పుడే వచ్చిన శేఖర్‌ను కూడా చూచేసరికి, ఆనందంతో అశ్రువులను ఆపలేకపోయారు మామగారు.

లక్ష్మీపతి :

వస్తాడో రాడో అనుకున్న శేఖర్ రావటమే కాకుండా పెళ్లాన్ని, పిల్లవాడిని కూడా తీసికొని వచ్చాడు. పాపం వాడికి నాస్థితి చూచేసరికి ఏడుపొచ్చింది. ఎలాగైనా మొదటినుంచి శేఖరానికి నేనంటే తగని ప్రేమ. నేనుగూడా మొదటినుంచి వాడి తెలివితేటల్ని చూచి వాడిమీదనే ఆశలు పెట్టుకున్నాను. మధ్యలో వాడు ఆ పని చేశాడని కోపం వచ్చి ఏదో పొరపాటున వాడిని అన్నాను కాని అసలు వాడి తప్పేముంది. అసలామాటకొస్తే విమలలాంటి పిల్ల నా కోడలు కావటం నిజంగా నాఅదృష్టం. నా మాట విని నేనుచెప్పిన పిల్లను పెళ్ళిచేసుకొన్న పెద్దకొడుకు, కోడలూ నాకేం వొరగబెట్టేరని! విమలే లేకపోతే యీ స్థితిలో నా పనేమయేదో! బంగారంలాంటి పిల్లను వీడు చేసుకోబోతే ఆ పిల్లజీవితం నాశనంకాకపోయిందా!

శేఖరం :

'మెద్రాసు పోదాం వస్తావా నాన్నా' అని అడగంగానే 'నీ యిష్టం'రా అని వొప్పుకున్నాడు. స్పెషల్ టాక్సీమీద సుఖంగా తీసుకుపోయాం మెద్రాసుకి. డాక్టర్ జబ్బు తేలిగ్గా నయమవుతుందని, దేహశాంతి, మనశ్శాంతి పూర్తిగా కావాలనిచెప్పేరు.

లక్ష్మీపతి :

డాక్టరు కూడా మంచివాడే దొరికాడు. మంచి మంచి మందులు వాడి కష్టపడి తొందరలోనే నన్ను నట్లురిలో తిరిగేట్టు చేశాడు. అన్నిటికన్న విమల చేసిన పరిచర్యలు జీవితాంతం మర్చిపోలేనివి. అసహ్యమనుకోకుండా అన్ని పనులూ చేసేది. ఈ కాలంలో చదువుకున్న పిల్లలు యిలా అన్నిపనులూ చేస్తారని యింతకుముందు నేను కలలో కూడా అనుకోలేదు.

విమల :

ఆ రోజు సాయంత్రం నన్నూ ఆయన్నూ పిల్చారు మామగారు. గదిలో కెళ్లేసరికి మనుమడిని వొళ్లో కూర్చోపెట్టుకొని బొమ్మలతో ఆడుకొంటున్నారు యిద్దరూ!

'రండి రండి అక్కడ కూర్చోండి!' కుర్చీలు చూపిస్తూ అన్నారు. ఇద్దరం కూర్చున్నాం.

'అమ్మాయ్! ఒక్కోతడవ పెద్దవాళ్ళకన్నా పిల్లలే తెలివిగల పనులు చేస్తుంటారు...'' ఏదో ప్లాను వేసికొని వుపోద్ఘాతంగా మొదలుపెట్టేరు.

కొంచెం ఆగి మళ్లీ మొదలుపెట్టారు.

''అంతెందుకు? యీ వెధవాయి చూడు? ఎంత తెలివైనవాడో! ఏరా నాన్నా ఏమంటావ్!' పిల్లవాడిని ముద్దుపెట్టుకొంటూ అన్నారు.

''వీడిముందు బొమ్మలన్నీ పడేస్తే వీడు మంచిబొమ్మల్ని ఏరుకొని వాటితో ఆడుకుంటూ ఆనందిస్తున్నాడు. ఇక యిన్నేళ్లొచ్చిన నా సంగతి చూడు. మంచేదో చెడ్డేదో తెల్సికోకుండా నిన్ను పెళ్లి చేసుకొంటానన్నందుకు అభం శుభం ఎరుగని అమాయకురాలివైన నిన్ను నాలుగు తిట్టి వాడిని నాలుగు తిట్టి వాడిని యింట్లోనుంచి గెంటేశానా! కష్టాలు పడగా పడగా ఆఖరికి నాగతేమయింది! మీరే దిక్కయినారు. ఆదరించి ఆనందాన్నిచ్చారు.' మామగారి కళ్లు చెమ్మగిల్లాయి.

''వూరుకోండి నాన్నా! అవన్నీ యిప్పుడెందుకు!' మధ్యలో ఆయన్నాపుతూ శేఖర్ అన్నాడు.

'అదికాదురా! మాటవర్స కన్నాను గాని వూరుకోక చేసేదేముందిలే! ఆ రోజు అన్నాను. ఈ పిల్లను పెళ్లిచేసికొంటే ఆస్తిలో కానీ నీకు యివ్వనని. ఇవాళా అదే అంటున్నాను. కాని ఆస్తంతా ఆ పిల్లకే యిస్తాను.'

'అదేమిటి మామగారూ! నా కెందుకు!' ఆశ్చర్యంగా అడిగాను నేను.

'నీవు లేకపోతే నాగతి ఏతీరయ్యేదోనమ్మా! ఆస్తే కాదు. నా సర్వస్వం నీ చేతుల్లోనే పెడ్తున్నాను. నీ యిష్టంవచ్చినట్లు చేసికో. నాకుమాత్రం వేళకింత తిండిపెడ్తే హాయిగా బాబుతో ఆడుకుంటాను.'

ఆనందంతో మామగారు యీ మాటలని బాబుతో ఆటలో నిమగ్నమైనారు. మా మామగారు చెప్పిన పద్ధతిమాత్రం నాకేమీ నచ్చలేదు.

**శేఖర్ :**

కొడుకులందరూ అనుభవించాల్సిన ఆస్తి మాకు మటుకే యివ్వటం నాకేమీ నచ్చలేదు. ఇది వింటే అన్నయ్యకు మేమంటే ద్వేషం పుట్టదూ! తమ్ముడేం కావాలి! ఆస్తంతా మూడు భాగాలుచేసి అన్నయ్య భాగం అన్నయ్య కిచ్చేసి తమ్ముడిని మన దగ్గరుంచుకొంటా మంటుంది విమల. ఈ పద్ధతి నాకూ నచ్చింది.

**విమల :**

నే ననుకొన్న విషయం మామగారితో చెప్దామని గదిలోకి వెళ్లేను. బాబిగాడితో ఒంటరిగా కూర్చొని విశ్రాంతి తీసికొంటున్నారు.

'ఏం అమ్మాయ్! ఇప్పుడొచ్చావ్!' అన్నారు మామయ్య.

ఆస్తి విషయంలో నా అభిప్రాయం చెప్పి అలాచేస్తే న్యాయంగా వుంటుందన్నాను.

'అదంతా నాకు తెలియదమ్మాయ్! ఆస్తంతా నీ కిచ్చాను. నీ యిష్టంవచ్చినట్లు చేసికో! కానీ ఆస్తంతా నీ కిచ్చినందుకు నేనొకటి అడుగుతాను. ప్రతి తండ్రీ జీవితంలో కోరుకొనేది గూడా యిదే! కొడుకులు ప్రయోజకులు కావాలనీ, పిల్లల్ని కనాలని, తన్ను సుఖపెట్టాలని, మనుమళ్లతో ఆనందంగా జీవితంలో ఆఖరిదశని గడపాలని. పెద్దవాడి పద్ధతి చూచి నా కోరిక నెరవేరుతుందనుకోలేదు. నా అదృష్టంకొద్దీ మీవల్ల అవన్నీ జరుగుతాయని అనుకొంటున్నాను. ఏమంటావమ్మాయ్!'

ఆయనడిగిన కోరికేమిటో నా కర్థంకాకపోగా ఆశ్చర్యం కలిగించింది. బాబిగాడు ఎప్పుడుపోయాడో నా దగ్గర కొచ్చిన వాడల్లా తాతయ్య ఒళ్లో కూర్చొని వచ్చీరాని మాటలు చెప్తున్నాడు.

నా సంగతి చూడకుండా వాళ్లిద్దరూ ఏమిటేమిటో మాట్లాడుకొంటున్నారు. ఇంక నే నెందుకక్కడ! మామగారు కోరింది యిచ్చేసినట్లేగా! ఆయన తీరవని అనుకొన్న కోరిక లేవో తీరేయిగా!

ఆంధ్రప్రభ వారపత్రిక — **24.9.1958**